# మ్యాచ్ ఫిక్సింగ్!

నాకు ఆంజనేయస్వామి ఆదర్శం! భీష్ముడు మార్గదర్శకత! పెళ్లంటే ఏవగింపు! ఎక్కడ ఎవరి పెళ్లి జరిగినా నేనింతవరకు అటెండవలేదు. నా మటుక్కు నాకు పెళ్లి చేసుకోవాలని లేదు. ఆడ వాసనే గిట్టదు. మా ఇంట ఆడపిల్లల్లేరు.. నేనొక్కడినే సంతానం!

చదువు పూర్తయి జాబ్‌లో చేరింది లగాయితు నన్ను పెళ్లిచేసుకోమని మా పేరెంట్స్ ఒకటే పోరు! పోరు కాదు వేధింపు!

నాకు పెళ్లొద్దు మొర్రోని మొత్తుకుంటున్నా మావాళ్లు విని చావరు. ఏం చేస్తాం? నా ప్రారబ్ధ ఖర్మ! పెళ్లి... పిల్లలు సంసారమనే జంజాటమంటేనే నాకు వొళ్లుమంట!

పెళ్లి చేసుకుతీరాలా? పెళ్లి చేసుకోకుంటే హేపీగా బ్రతకలేరా? మా చిన తాతగారు ఆ జన్మ బ్రహ్మచారిగా సెంచరీ కొట్టాడు. రెండు చేతులా ఆర్జించి సుఖపడ్డాడు.

ఆడవారిలో మగవారిలోనూ పెళ్లంటే ఇష్టం లేనివాళ్లు.... పెళ్లి చేసుకోని వాళ్లు ఎందరో?

అదేమంటే వంశం వృద్ధి చెందాలంటూ డాడీ చెవిలో జోరీగలా ఒకటే పోరు. మమ్మీ కళ్ల నీళ్ళు పెట్టుకోని రోజంటూ లేదు.

అటు ఆఫీసులో ఇటు ఇంట్లో.... అందరూ పెళ్లిచేసుకోమంటూ నన్ను గోకే వారే!

కోడలు ఇంట్లో అడుగుపెడితే అత్తమామలను సుఖపడనీయదు. మొగుడుకి మనశ్శాంతి వుండనీయదు. రోజూ ఇంట్లో చిన్న సైజు 'వార్' జరుగుతుంది. ఎవరింట్లో చూద్దామన్న ఇదే సీను! కోరి కొరివితో తల గోక్కునట్టు!

అధవా ఏ ఆడపిల్ల మెడలోనైనా మూడు ముళ్లు వేస్తే... మరుక్షణం నుండే భార్యామణి డామినేషన్! మూతి విరుపులు.... ఎత్తిపొడుపులు... ఎట్సెట్రా! ఆడ ప్రతాపం మొదలవుతుంది. అత్తాకోడలు కొట్టుకుచావటం. అందరికీ మనశ్శాంతి కరువౌటం! ఒక్క సారి... ఒకే ఒక్కసారి చేసే తప్పుకు జీవితాంతం యమ యాతన

అనుభవించటం! బ్రతకటానికి ఇదంతా అవసరమా-

నా మెగుడు... నా సంసారం... నా భర్త సంపాదన... మా సుఖం అంటూ విర్రవీగుడు! ముద్దుముచ్చట తీరకముందే వేరుకుంపటి! పేరెంట్స్ గగ్గోలు!

జీవితంలో ఇలాంటి సీన్లు చోటుచేసుకోవటం నాకస్సలు ఇష్టముండదు. అందుకే పెళ్ళివద్దనుకున్నాను.

ముక్కు మోహం తెలియని పిల్లమెళ్లో తాళి కట్టి... పళ్లికిలించుకుంటూ భార్య కొంగు పట్టుకు తిరగటం... ఆమె పెట్టే చీవాట్లు చికెన్ బిర్యానీగా భావించి సర్వెంటు లాగ బ్రతుకీడ్చటం నాకు బొత్తిగా నచ్చని విషయం.

నా దృష్టిలో పెళ్లనేది స్లేవరీ! ఒకరికొకరు నౌకర్లు! భర్త బిళ్ల బంట్రోతు! ఐడోన్ట్ లైక్ ఆల్ దిస్! మోరోవర్ ఐ హేటిట్!!

స్వాతంత్ర్యం కోల్పోయిన అల్ప జీవిలా పెళ్లానికి దాసోహం చేస్తూ... అడుగులకు మడుగులొత్తటం... బజారుకెడితే పిల్లలను నేను చంకనేసుకుమోస్తుంటే ఆమె చేతులూపుకుంటూ పక్కనే నడపటం..

వాటీజ్ ఆల్ దిస్ నాన్సెన్స్! ఫ్రీడమ్ లేని లైఫ్ మగాడిది. అందుకే పెళ్లంటే నాకు రోత!

పెళ్లాన్ని కోప్పడకూడదు. పళ్లెత్తు మాట అనటానికి వీల్లేదు. నెల జీతం యావత్తూ ఆమె దోసిట్లో కుమ్మరించి చిల్లర డబ్బుల కోసం చేతులు కట్టుకుని నిలబడటం నాకు నచ్చదు.

పౌడర్లు... సోపులు... సెంట్లు... ఎన్నికొన్నా నోరు మెదిపే హక్కు కోల్పోయే హీనత్వాన్ని సహించలేను. చిరాకుపడి చేయి చేసుకుంటే ప్రచ్ఛన్న యుద్ధమే! మహిళల హక్కులను హరిస్తున్నానంటూ మహిళ సంఘాలకు ఫిర్యాదు. పోలీసు రిపోర్టు. అటుపై వూచల లెక్కింపు. శిక్షపడి జైల్లో చిప్పకూడు!- ఇవన్నీ అవసరమా?-

అందుకే పెళ్లి వద్దుమొర్రో అన్నాను. అప్పట్నుంచి పేరెంట్స్ నిరసనలు పాటించటం... నాతో మాట్లాడకపోవటం చూచి చిర్రెత్తుకొచ్చింది.

'మీరీవిధంగా సాధిస్తే నేను ఏ మూగదాన్నో చెవిటి దాన్నో పెళ్లాడి మీ(నా) రోగం కక్కున కుదురుస్తాను'. రెచ్చిపోయి అన్నాను.

'ఏవిట్రా? నీకేమైనా మతిపోయిందా?-' జగన్నాథం మండిపడ్డాడు.

'ఇదేం పాపిష్ఠి ఆలోచనా? అలాంటి పిల్లను పెళ్లాడేందుకు... నీకెం తక్కువ? పెద్ద చదువు అఘోరించావు! నెలకు యాభైవేలు సంపాదిస్తున్నావ్! పైగా నువ్వు ఒక్కడివే మగపిల్లాడివాయె... నువ్వు ఒప్పుకుంటే అందగత్తెలొచ్చి ఇంటి ముందు క్యూ కడతారు..! తల్లి ముక్తాయింపు.

'నువ్వు పాతకాలపు మనిషివమ్మా! ఈరోజుల్లో ఆడపిల్లల గురించి నీకు బొత్తిగా తెలీదు. వెనకటి కాలం కాదు. ముప్పై దాటేక పెళ్లిళ్లు, అందాకా చదువులనే నెపంతో సంపూర్ణ స్వాతంత్ర్యం... స్వేచ్ఛ... విర్రవీగుడు! నేటి తరం ఆడప్లిలతో నువ్వసలు వేగలేవు. ఇంజనునుండి బోగీలను విడదీసినట్టు... పెళ్లై నెల తిరక్కుండానే వేరు కాపురం అంటుంది. మీ నెత్తిన బొగ్గుల కుంపటే! నేనేమీ అన్లేను. ఆవు వెంట దూడలా పెళ్లాం కొంగు పట్టుకు బైటికి నడవక తప్పదు. నేనెందుకు చెప్తున్నానో ఆలోచించుకో మమ్మీ... కాదు కూడదంటే వేధిస్తున్నాననే నెపంతో కోర్టుకెక్కటం!... అటుపై విడాకులు! బతుకు పులివిస్తరాకౌతుంది- ఇదంతా అవసరమా మనకు?'

'నోర్మూయ్యరా!- తెలుగు సినీమాలు... టీ.వి. సీరియల్స్ చూస్తూ నేర్చుకునేది ఇదా?- అందరూ అలా వుంటారట్రా?- అంతా నీ అపోహ! కొట్టుకు చస్తూ బతకటమేరా వైవాహిక జీవితమంటే...' నచ్చ చెప్పచూచింది.

'నేను పెళ్లి చేసుకోవాలీ అంటే నేను పెట్టిన కండిషన్స్ ఉన్న అమ్మాయిని చూడండి. అంటే అర్థమైందా? చెవిటిది... మూగది అన్నమాట! అట్లాగే ఆ ప్లిలని ఎంచక్కా పెళ్లి చేసుకుంటాను.... సరేనా?-

ఎంత మొత్తుకున్నా ప్రయోజనం లేదన్పించటంతో తమకు ఇష్టం వున్నా లేకపోయినా... నా కోరిక మేరకు నే కోరిన లక్షణాలున్న పిల్లను వెతకటం పేరెంట్స్‌కు తప్పనిసరైంది.

× × × × ×

నా కల ఫలించి నా కోరిక నెరవేరింది!

మూగ, చెవుడు వున్న పిల్లతో మ్యాచ్ ఫిక్సైంది! అందునా కాబోయే మామ గారు మాడాడీకి చిన్ననాటి మిత్రుడట! ఇంకేం మా రెండు కుటుంబాల మధ్య ఎలాంటి పొరపొచ్చాలుండవ్.

మైథిలి.... అంటే... అదేనండీ నావైఫ్ రూపసి.

మైథిలిని చూచిన వారెవరు ఆమె మూగది, చెవిటిది అని అసలు అనుకునే ఛాన్సేలేదు. హమ్మయ్య! నా భార్య మూగది అయినందున ఇంట్లో ఎవరి మీద నోరు పారేసుకోదు. విరుచుకుపడదు. నోటికొచ్చినట్టు తిట్టే ఛాన్సే లేదు. ఇకపోతే చెవుడు కూడా వుంది కావున దాన్ని మేము ఏం కామెంట్ చేసినా భయం లేదు. ఇంకేం... మా కాపురం మూడుపూవులు ఆరుకాయలే! అంతా హేపీసే! ఇంట్లో కొత్త కోడలువల్ల తగాదాలనేవే వుండవు! థాంక్‌గాడ్!! అసలు పెళ్లే వద్దనుకున్న నాకు భలే పెళ్లాం దొరికినందుకు తెగ సంబరపడ్డాను.

శోభనం మామగారింట్లో హైలెవల్లో ఏర్పాటు చేశారు.

నాచేత ఆడంగులంతా కలిసి పన్నీటి స్నానం చేయించి అత్తరు... సెంటు వళ్లంతా స్ప్రే చేశారు. పంచ లాల్చీ కట్టించారు. తొమ్మిది కొట్టగానే.. అనగా సరిగ్గా ముహుర్త సమయానికి అమ్మలక్కలంతా ఏకమై నన్ను గదిలోకి తోసారు.

వాట్ ఎ బ్యూటిఫుల్ డెకరేషన్? సినిమాల్లో కూడా శోభనం గదిని ఇంత అందంగా అలంకరించటం చూడ్లేదు.

స్వర్గంలోకి అడుగుపెట్టినట్టన్పించింది. ఇహ... రంభ, ఊర్వశి, తిలోత్తమలను తలదన్నే అందాలరాశి నా మైథిలి గదిలోకి ఎంటరవటమే ఆలశ్యం.

స్వీట్సు... ఫ్రూట్సు ఓవైపు. సెమీ న్యూడ్ తైల వర్ణ చిత్రాలేమో గోడలకు వ్రేలాడుతూ అగుపించగానే నాకు మతిపోయింది. అబ్బో! మామమాంఛి టేస్ట్ వున్న వాడే అనుకున్నాను.

ఇంతరేంజ్‌లో శోభనం అరేంజ్ చేయబడుతుందని కలలోనైనా వూహించలేకపోయాను. అందమైన పెళ్లాం... డబ్బున్న మామగారు! ఇహ నాకేం తక్కువన్పించింది. నేను మొత్తానికి లక్కీ ఫెలోనే! నన్ను నేను అభినందించుకున్నాను.

ఇక రాత్రంతా మూగ సైగలతో గడపాలి కాబోలన్పించింది. ఓ మాట... ఓ ముచ్చట వుండదేమో? నేనెంత గొంతు చించుకున్నా విన్పించి చావదు కాబోలు! అసలింతకూ నా నిర్ణయం... అనగా మూగ, చెవిటి దాన్ని చేసుకోవాలనే నిర్ణయం సరైనదేనాని? నో!... తప్పు చేశానన్పించింది. ఇలాంటి పిల్లను జీవిత భాగస్వామిగా చేసుకుని వుండాల్సింది కాదు. ఇప్పుడు చూడు? కొత్త కష్టాలు మొదలవుతయ్! వామ్మో! తల్చుకుంటేన భయం వేస్తోంది. ఒక్క రాత్రి గడవటమే దుర్భరమన్పిస్తుంటే

ఇక జీవితాంతం కాపురం చేయటం ఎట్లారా భగవంతుడా? కడుపులోంచి ఏడుపు తన్నుకొస్తోంది. కానీ... శుభసమయాన ఏడవకూడదన్పించటంతో దుఃఖాన్ని దిగమింగుకోక తప్పలేదు.

ఎంటర్‌ది డ్రాగన్‌లో బ్రూస్లీ లాగ మైథిలి పాల గ్లాసుతో గదిలోకి ఎంటరైంది. దాని ముఖంలోకి చూడాలంటేనే ఏదో తెలియని బాధ నన్ను మెలికలు తిప్పుతోంది. ఆముదం తాగిన వాడిలా ముఖం పెట్టాను.

తెల్ల చీరలో దివి నుండి భువికి దిగి వచ్చిన దేవకాంతలా అన్పించింది మైథిలి. ఆ క్షణంలో నా కళ్లకు. లేచి వెళ్లి అమాంతం కౌగలించుకోవాలన్పించింది కానీ అంతటి సాహసం చేయలేకపోయాను. మాటలు రాని మూగది కదా? నా యాక్షన్‌కు రియాక్షన్ వుంటుందో లేదోనని సంశయంలో పడ్డాను.

'హలో డియర్... ఎందుకనో కంగారుపడుతున్నట్టున్నావ్. డోన్ట్ వర్రీ- నేనొచ్చేశాగా నీకేం భయం లేదు. నీలో వున్న వొంటరితనాన్ని దూరం చేస్తా...' అంటూ దగ్గరకొచ్చి గ్లాసెడు పాలూ గటగటా తాగేసి బ్రావ్‌మని త్రేన్చింది మైథిలి.

మైథిలి నోటివెంట వెలువడిన మాటలు విని కొయ్యబారిపోయాను. మతిపోయినట్టయింది. ఇదేమిటీ?- మూగది ఎట్లా మాట్లాడగలుగుతోంది? అంటే... ఇది మూగది కాదన్నమాట! చెవుడు కూడా లేదేమో?... అయితే తండ్రి కూతుళ్లు ఏకమై డ్రామా ఆడి నా తిక్క కుదిర్చారన్నమాట! నో! నేనీ అవమాన భారాన్ని సహించలేను.

శోభనం గదిలోంచి భళ్లున బైటికొచ్చాను. మైథిలి మూగది కాదనే విషయం డాడీ మమ్మీలకు చెప్పి మోసపోయినందుకు భోరును ఏడ్చినంత పనిచేశాను.

'ఒరే వియ్యంకుండూ!- ఇంత ఘోరంగా మమ్మల్ని మోసగిస్తామనుకోలేదు. మనం 'చిన్ననాటి మిత్రులం కదా?- నీ కూతురు మూగది, చెవిటిదని ఎందుకురా అబద్ధం చెప్పావ్' మా డాడీ మామగారిని నిలదీశాడు.

'ఆవేశ పడకురా! నీతో వియ్యమందాలనేది నా చిరకాల వాంఛ! దాన్నీ విధంగా తీర్చుకున్నాను. తప్పా?-'

'తప్పా... తప్పన్నరా?... నువ్ మమ్మల్నందరిని ఛీట్ చేశావురా...' రెచ్చిపోయిన డాడీని కంట్రోల్ చేయటం కష్టమైంది.

'నే చెప్పేది వినరా!... అసలేం జరిగిందంటే... నాకూతురు నోరు లేని పిల్ల అన్నాననే గానీ మూగదన్నీ చెప్పలేదే! నామాటని నువ్వు మరో విధంగా అర్థం చేసుకున్నావ్! తప్పు నీది! పైగా... మేము ఎవరం ఏం చెప్పినా విన్పించుకోదురా నాకూతురు అని చెప్పానే గానీ దానికి బ్రహ్మచెవుడు అని అన్లేదే! ఈ రెండు విషయాలను నీక్కావలసిన రీతిలో నువ్వు అన్వయించుకున్నావ్! అంతేరా!- నా కూతురు మైథిలి సుగుణాల రాశి! మిమ్మల్ని ఆప్యాయతానురాగాలతో చూచుకుంటుందిరా! చక్కటి సంస్కారవంతురాలురా నాకూతురు- నా మాట నమ్ము! ముందు ముందు మీకే అర్థమౌతుందిగా మైథిలి ఎలాంటిదో... ఇందులో నా తప్పుగాని మోసం గాని కించిత్తయినా లేదు. నా మాటలను మరో విధంగా అర్థం చేసుకున్నది మీరు- అవునా?!- 'వాస్తవాన్ని వివరించాడు పిల్ల తండ్రి.'

అక్కడితో అందరి నోళ్లకు గోద్రేజ్ తాళాలు పడ్డట్టయింది.

మన పిల్లల 'మ్యాచ్‌ఫిక్సింగ్' ఈ విధంగా జరిగినందుకెంతో ఆనందంగా వుందంటూ వియ్యంకులిద్దరూ కౌగిలించుకున్నారు.

నోరు మూసుకుని నేను, గలగలా నవ్వుతూ మైథిలీ శోభనం గదిలోకి రీ ఎంట్రీ ఇచ్చాం!!

(28-1-2012 ఆంధ్రభూమి తెలుగుడైలీ)